# నమస్తే తెలంగాణ
## వరంగల్ హనుమకొండ
5 | మంగళవారం 11 జూన్ 2024 | WARANGAL HANUMAKONDA




ప్రజావాణిలో జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

# కలెక్టరేట్‌కు ఇసుక లొల్లి

## విసిగిపోయి గ్రీవెన్స్‌కు వచ్చిన రైతులు

**బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు**
**స్పందించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**
**తాత్కాలికంగా పనుల నిలిపివేత**
**వాగు నుంచి పొక్లెయిన్ తరలింపు**
**నేడు విచారణకు అధికారుల బృందం**
**ఇసుక తరలిస్తే ఉద్యమమే : బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక**

దేవరుప్పుల, జూన్ 10 : దేవరుప్పుల మండలం రాంభోజీగూడెం, గొల్లపల్లి వాగుల నుంచి ఇసుక తరలించొద్దంటూ రైతులు తిరుగుబాటు చేశారు. ఇసుక తరలింపును వెంటనే ఆపాలని వందలాది మంది వాగు పరీవాహక రైతులు సోమవారం బీఆర్ఎస్ నేతృత్వంలో జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి పంట పొలాలు ఎండిపోతున్నాయని మహిళా రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. చెన్నూరు రిజర్వాయర్ కోసం రాంబోజిగూడెం చెక్ డ్యాం నుంచి 5 వేలు, పాలకుర్తి రిజర్వాయర్ కోసం గొల్లపల్లి చెక్ డ్యాం నుంచి మరో 5 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలిస్తే తమ ప్రాంతం ఎడారిగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వాగులో ఎంత ఇసుక ఉంటే అన్ని నీళ్లు నిలుస్తాయని, ఈ విషయం తెలియని సంబంధిత అధికారులు తరలింపునకు సిఫారసు చేయడంపై మహిళా రైతులు వివరించారు. రైతుల వేదనను సావధానంగా విన్న కలెక్టర్ విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రీవెన్స్ నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు నేరుగా రాంభోజీగూడెం వాగుకు వెళ్లారు. అప్పటికే వాగు నుంచి పొక్లెయిన్‌ను ఐబీ శాఖ అధికారులు ఒడ్డుకు తరలించడంతో కలెక్టర్‌కు రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వాగులో మీటరున్నర ఇసుక ఉండడాన్ని మహిళలు స్వయంగా చూపారు. ఈ ఇసుకను తరలించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని, దీని వల్ల మట్టి తేలుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాగును ఆధారంగా చేసుకొని వ్యవసాయం చేస్తున్న తాము ఇబ్బందులు పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



వాగులో ఇసుక తోడిన చోట మట్టి తేలిన ప్రాంతాన్ని చూపుతున్న మహిళలు

**ఇసుక తరలిస్తే ఉద్యమమే : బీఆర్ఎస్**

దేవరుప్పుల మండలంలోని వేలాది మంది రైతులు వాగులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, ఇసుకను తోడితే భూగర్భ జలాలు అడుగంటి అన్నదాతలు ఇబ్బంది పడతారని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. వేలాది ట్రక్కుల ఇసుక తరలింపునకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారని, దీనికి పలు విభాగాల అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలే కారణమన్నారు. పలుసార్లు రైతులు గొల్లపల్లి, రాంభోజీగూడెం వాగుల నుంచి ఇసుక తరలింపును అడ్డుకున్నా కాంట్రాక్టర్లు మళ్లీ పొక్లెయిన్లతో తోడుతున్నారని, దీంతో బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి అన్నారు. స్థానిక అవసరాలకే ఇసుకను వాడాలని, భారీ ప్రాజెక్ట్‌కు తరలించొద్దన్నారు. 20 ఏళ్ల క్రితం 30 ఫీట్ల లోతున్న ఇసుక నేడు రెండు మీటర్లకు తగ్గిందన్నారు. వాగుపైన నిర్మించిన రిజర్వాయర్ల వల్లే ఇసుక కిందికి రావడంలేదని, దీనిని గమనించి అధికారులు ఇసుక తోడడాన్ని ఆపాలని ఆయన కోరారు.

### వాగులో ఉన్న చేతి బోరుతో బతుకుతున్నం



తరతరాలుగా వాగులో ఉన్న చేతి బోరుతో బతుకుతున్నం. మాపై కలెక్టర్ కనికరం చూపాలి. ఇసుక అనుమతులు రద్దు చేయాలి. బోరు వేసుకునే స్థోమత మాకు లేదు. వాగుల బోరు పోతే ఎవుసం పడావే. తిండికి గింజలు ఉండవు. మా ఇసుకపైనే అధికారుల కన్ను పడాల్నా. దేశంల ఇసుక కరువుపోయింది. గోదావరి నుంచి తెచ్చుకోవాలి. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తుంది కదా. మేం ఎంతకైనా తెగిస్తం.. ఇన్ని రోజుల నుంచి ఇసుకను కాపాడుకుంటున్నం. స్థానిక అవసరాలకే ఇసుక వాడాలి. మా పొట్టకొట్టొద్దు.

– బలుగుల రేణుక, రైతు, చినమడూరు



రాంభోజీగూడెం వాగులో ఇసుకను పరిశీలిస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

## తాత్కాలికంగా పనుల నిలిపివేత

జనగామ చౌరస్తా : దేవరుప్పుల మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వాగుల్లో నుంచి ఇసుక తరలించే పనులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మండలంలో పంట పొలాలు ఎండిపోకుండా, భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉండడానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీవో కొమురయ్య, జిల్లా వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జల, గనుల శాఖ అధికారులతో పాటు సాంకేతిక బృందం మంగళవారం ఉదయం 10గంటలకు మండలంలో పర్యటిస్తుందని తెలిపారు. అధికారుల బృందం అందజేసే నివేదిక ఆధారంగా తర్వాత చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మండల రైతాంగం పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలు తగ్గించాలి

**ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి**

హనుమకొండ సబర్బన్, జూన్ 10 : విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచుగా విద్యుత్ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగించే విషయమని, ఇవి ప్రధానంగా భద్రతపై నిర్లక్ష్యం, అవగాహనా లోపం వల్ల సంభవిస్తున్నట్లు తెలిపారు. వీటి నివారణకు గృహాల్లో వైరింగ్ కోసం నాణ్యమైన తీగలను ఉపయోగించుకోవాలని, ఎర్తింగ్ పాటించాలని సూచించారు. ఎన్పీడీసీఎల్ సంస్థను జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థగా తీర్చిదిద్దేందుకు పూర్తి చర్యలు చేపట్టాలని సూచించారు.

**గోదావరి పరీవాహక ప్రాంత భూములపై దళారులు, కాంట్రాక్టర్ల కన్ను**

- రైతుల పేరుతోనే పర్మిషన్లు.. తర్వాత కాంట్రాక్టర్లదే హవా
- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- ఎకరానికి రైతుకిచ్చే కౌలు రూ.లక్ష మాత్రమే
- అక్రమమార్గంలో కోట్లు గడిస్తున్న దళారులు



మేట వేసిన పంట భూముల్లోని ఇసుకను లారీల్లో లోడ్ చేస్తున్న పొక్లెయినర్

# ఇసుక మేటలు.. అక్రమార్కులకు కాసులు

ఏటూరునాగారం, జూన్ 10 : పంటలు సాగు చేసే భూముల కంటే ఇసుక మేటలు వేసిన పట్టా భూములకు ప్రస్తుతం డిమాండ్ ఉన్నది. ఎకరానికి సుమారు లక్ష రూపాయల వరకు కౌలు చెల్లించేందుకు దళారులు, కాంట్రాక్టర్లు ముందుకు వస్తుండడంతో రైతులు వారి వైపే మొగ్గు చూపుతున్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో మూడేళ్లుగా ఇసుక మేటల తొలగింపును అటవీశాఖ అధికారులు అడ్డుకున్నా, ఇటీవల మళ్లీ మొదలైంది. రెండు నెలల నుంచి తొలగింపు ప్రక్రియ జోరుగా సాగుతుండడంతో దళారులు, కాంట్రాక్టర్లు అలాంటి భూముల కోసం వెతుకుతున్నారు. మొదట కాంట్రాక్టర్లు, దళారులు ఇసుక మేటలు వేసిన భూములున్న రైతులతో ఒప్పందం కుదుర్చుకొని, ఇసుక మొత్తం తీసే వరకు అనుమతి పొందుతారు. ఇందుకు ఏడాది నుంచి మూడేళ్లు పట్టే అవకాశం ఉన్నది. గతంలో ఎకరానికి రూ.80వేల వరకు కౌలు చెల్లించగా, ఈ ఏడాది తాజాగా రూ.లక్ష వరకు ఇస్తామంటూ రైతులతో అగ్రిమెంట్ రాయించుకుంటున్నారు. అయితే, కొంతమంది దళారులు కౌలుకు తీసుకుని డబ్బులు సరిగ్గా చెల్లించకుండా ఇబ్బంది పెడుతుండడంతో అనేక చోట్ల రైతులు ఇసుక తొలగింపును అడ్డుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసిన భూములు ఉన్నాయి. జంపన్నవాగుతో పాటు అనేక వాగులు, గోదావరి కోతకు గురైన భూములు ఇసుక మేటలతో ఉన్నాయి. పంట భూముల్లో వేసిన ఇసుక మేటలను తొలగించేందుకు రైతులకు ఆర్థిక స్థోమత లేని కారణంగా దళారులపై ఆధారపడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఇసుక మేటల తొలగించుకోవడం వల్ల నేల బయటపడితే మళ్లీ వ్యవసాయం చేసుకునే అవకాశం కోసం అనుమతి ఇస్తుంది. కానీ, అంతా నిబంధనలకు విరుద్ధంగానే జరుగుతున్నది. 10 నుంచి 20 అడుగుల లోతు వరకు తవ్వినా మట్టి రావడం లేదు. ఇసుక తొలగించిన తర్వాత తిరిగి వ్యవసాయం చేసుకునేందుకే అనుమతి ఇస్తున్నప్పటికీ ఎక్కడ ఎకరం భూమి కూడా సాగులోకి రాలేదు. ఇసుక మేటల తొలగింపు పేరుతో జరిగే దందాలో స్థానికంగా కొందరు దళారులు జోక్యం చేసుకుని బడా పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో రైతుల కంటే దళారులే లక్షల్లో లాభపడుతున్నారు. ఇక రైతులకు సకాలంలో కౌలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న వారు కూడా ఉన్నారు.



లోతుగా చేపట్టిన తవ్వకాలు

**తవ్వకాల్లో అక్రమాలు**

ఇసుక మేటల తొలగింపు పేరుతో నిర్వహించే క్వారీల్లో కొందరు కాంట్రాక్టర్లు, దళారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇసుక మేటల తొలగింపునకు రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తారు.అయితే, కొందరు దళారులు, కాంట్రాక్టర్లు అనుమతి పొందిన భూమిలోనే కాకుండా వాటి పక్కన ఉన్న భూముల్లో కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా టీఎస్ఎండీసీ, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతంలోనే ఈ దందా ఎక్కువగా జరుగుతున్నది. అనుమతి లేకుండా అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి ఇసుక తీసుకునేందుకు అలవాటు పడిన కాంట్రాక్టర్లు కౌలు ధరలు పెంచేస్తున్నారు. మీటరు లోతు కంటే ఎక్కువ ఇసుక తీయొద్దనే నిబంధన ఉన్నప్పటికీ అటు కాంట్రాక్టర్లు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతుండడంతో భూ గర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే.

### వేలల్లో కౌలు.. లక్షల్లో వసూలు

ఇక కౌలు ధర తక్కువగా చెల్లించి అనుమతి వచ్చిన తర్వాత క్వారీల్లో ఇసుక అమ్ముకొని కాంట్రాక్టర్లు లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. ఇసుక మేటల తొలగింపు పేరుతో నిర్వహించే క్వారీకి అనుమతి వచ్చిన తర్వాత టీఎస్ఎండీసీ ద్వారా ఇసుక అమ్మకాలు కొనసాగుతాయి. రైతుల పేరుతోనే అనుమతి పొందినా తర్వాత కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యం. పేరుకే రైతు.. అంతా కౌలుదారులదే పెత్తనం. రైతుల తరఫున కాంట్రాక్టర్లు యంత్రాలను సమకూర్చుతారు. క్వారీ నడిచే సమయంలో కాంట్రాక్టర్లు, అధికారుల మధ్యే లావాదేవీలు నడుస్తుంటాయి. లారీకి లోడింగ్‌కు చార్జీలు అదనమంటూ రూ.3,500 చొప్పున దొడ్డిదారిన వసూలు చేస్తున్నారు. ఇలా ఆయా క్వారీల్లో ఉన్న ఇసుక నాణ్యతను బట్టి కాంట్రాక్టర్లు కోట్లల్లో డబ్బులు సంపాదిస్తున్నారు. ఇలా అక్రమంగా డబ్బు సంపాదించే అవకాశం ఉండడంతో కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులు ఇసుక క్వారీలు పొందేందుకు పోటీ పడుతున్నారు. ఏపీ, హైదరాబాద్‌కు చెందిన కొందరు పెట్టుబడిదారులు ఇసుక క్వారీల్లో భాగస్వాములవుతున్నారు.

# కండువా కప్పుకుంటేనే కరెంట్


**కమీషన్లు ఇస్తేనే బోర్లు**

- రైతులను బ్లాక్ మెయిన్ చేస్తున్న కాంగ్రెస్ లీడర్లు
- ఇప్పటికే రూ. 2.80 లక్షలు వసూలు
- సొంత పార్టీ నేతలనూ వదలని వైనం
- వాట్సాప్ గ్రూపుల్లో వైరలవుతున్న పోస్టు



మాజీ ఉపసర్పంచ్ గుండెబోయిన మంజుల-సాంబయ్య

నల్లబెల్లి, జూన్ 10 : కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఏజెన్సీ భూములకు కరెంట్ ఇస్తామని ఆ పార్టీ చోటా మోటా లీడర్లు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. బోర్ కనెక్షన్ కోసం డబ్బులివ్వాలంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే రూ. 2.80 లక్షలు వసూలు చేసిన వారు సొంత పార్టీ నేతలనూ వదలడం లేదు. ఇందుకు సంబంధించిన పోస్ట్ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలంలోని ఆసరవెల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ గుండెబోయిన సాంబయ్య ఆరోపణ మేరకు వివరాలిలా ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు పోడు పట్టాలు పంపిణీ చేసింది. ఈ భూములకు కరెంట్ సరఫరా చేసి రైతులు బోర్లు వేసుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అనుమతి ఇచ్చారు. ఇదే అదనుగా భావించిన మేడెపల్లి గ్రామ కాంగ్రెస్ ఎంపీటీసీ భర్త మోహన్‌తోపాటు ఆసరవెల్లి, మేడెపెల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు జనగాం రాజు, వంగర వెంకన్న, కార్యదర్శి ఆవుల ఐలయ్య బోరు వాహనాల ఏజెంట్ల నుంచి రూ. 2.80 లక్షలు కమీషన్‌గా తీసుకుని తలా రూ. 77 వేలు పంచుకున్నారు. అంతేగాక పోడు పట్టాలు పొందిన 490 మంది రైతులు 9 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు తీయగా, ఇటీవల కాంట్రాక్టర్ విద్యుత్తు స్తంభాలు తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న రైతులకే కరెంటు ఇస్తామని, అలాగే తమకు ప్రతి రైతూ కమీషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనికి రైతులు ససేమిరా అనడంతో విద్యుత్ కాంట్రాక్టర్, ఫారెస్ట్ అధికారులను బెదిరింపులకు గురి చేసి స్తంభాలను తిరిగి పంపించారు. అయితే కాంగ్రెస్ ముసుగులో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వీరి బాగోతాన్ని ముఖ్య నాయకులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో తానే వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశానని మాజీ ఉప సర్పంచ్ మంజుల-సాంబయ్య తెలుపడం విశేషం.



Gundeboina Sambaiah Congress
Forwarded
ఫ్లాష్ ఫ్లాష్ ఫ్లాష్
Dt 10-06-2024
ఆసరవెల్లి, మేడపల్లి, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ చోటా,మోటా లీడర్స్ కొంతమంది...
ఆసరవెల్లి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ గుండెబోయిన , మంజుల సాంబయ్య గారి వద్ద నలుగురు వ్యక్తులు .. సాంబయ్య కు చెందిన borewell వాహనం నడుపుకుంటూ ఉండగా... తన దగ్గర కమిషన్లు అడిగి మనిషికి 70,000 చొప్పున 2,80,000 రూపాయలు తీసుకున్నారు... ఇంకా కొంత డబ్బులు కమిషన్ ఇవ్వాలంటూ తనపై ఒత్తిడి తీసుకు వచ్చారు, లేదంటే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామంటూ ఒత్తిడికి గురిచేశారు... ఆ బెదిరింపులకు భయపడని నేను మీరు అడిగిన నగదును నేను ఇవ్వలేనని తేల్చి చెప్పాను.. ఇంతటితో ఆగని ఆ నలుగుర ప్రజాప్రతినిధులు తనపై సస్పెండ్ ఇష్యూ

వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయిన పోస్ట్

# నేను చావలేదు.. రెస్ట్ తీసుకుంటున్నా!

- చెరువు నీటిలో విగతజీవిగా పడి ఉన్న కూలీ
- మృతదేహం అనుకొని 100కి సమాచారం
- అవాక్కయిన పోలీసులు, స్థానికులు



చెరువులో పడుకున్న వ్యక్తిని బయటకు తీస్తున్న పోలీసులు

*నయీంనగర్, జూన్ 10 : చెరువు ఒడ్డుకు ఓ వ్యక్తి నీటిలో తేలియాడుతుండడాన్ని స్థానికులు గమనించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అలాగే పడి ఉండడంతో చనిపోయాడనుకున్నారు. వెంటనే 100, 108కి డయల్ చేశారు. సమాచారం అందగానే పోలీసులు, 108 సిబ్బంది అంబులెన్స్‌తో అక్కడికి చేరుకున్నారు. మరి ఆ వ్యక్తి చనిపోయాడా? ఒకవేళ ప్రాణాలతో ఉంటే బతికిద్దామనుకున్నారు. ఈ క్రమంలో అతడి చేయి పట్టుకొని నీటిలోంచి బయటకు తీస్తుండగా హఠాత్తుగా లేచి అరవడంతో అం తా అవాక్కయ్యారు. ఊహించని ఈ పరిణామంతో అక్కడున్నవారంతా ఖంగుతిన్నారు. 'ఇక్కడ చల్లగా ఉందని నేను రెస్ట్ తీసుకుంటున్నా.. నేను చావలేదు.. బతికే ఉన్నా' అంటూ తాపీగా సమాధానమివ్వడంతో ఒకరి మొఖాలు ఒకరు చూసుకోవాల్సి వచ్చింది. ఈ ఘటన సోమవారం కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధి రెడ్డిపురంలోని కోవెలకుంటలో జరిగింది. ఆరా తీస్తే అతడు నెల్లూరు జిల్లా కావలికి చెందిన శ్రీనివాస్(46) అని, కాజీపేట దగ్గరలోని ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తానని చెప్పా డు. ఉదయం 7నుంచి రాత్రి 7వరకు పనిచేస్తానని ఇప్పుడు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నానని తెలిపాడు. ఒక రూ.50 ఉంటే కాజీపేటకు పోతాను?' అంటూ బతిమాలుకున్నాడు.*



బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విశ్రాంత ఉద్యోగులు (ఫైల్)

# పర్యావరణ హితానికి అవిశ్రాంత కృషి

- రెండేళ్లుగా మొక్కలు నాటి సంరక్షణ
- ప్రయాణికుల కోసం సిమెంట్ బెంచీల ఏర్పాటు
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపు
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

మహదేవపూర్, జూన్ 10 : వారంతా రిటైర్డ్ ఎంప్లాయిస్. ఎన్నో ఏండ్లు ఉద్యోగ బాధ్యతల్లో ఉండి సమాజానికి విశేష సేవలందించారు. అనేక సవాళ్లను, ఆటుపోట్లను దీటుగా ఎదుర్కొని చివరకు ఉద్యోగ విరమణ పొందారు. కానీ రిటైర్ అయ్యామని ఇంటికే పరిమితం కాకుండా సమాజ హితానికి పాటుపడుతున్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ కోసం అ'విశ్రాంత' కృషి చేస్తున్నారు. మహదేవపూర్‌లో 75 మంది కలిసి ఓ సంఘంగా ఏర్పడి మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు బస్టాండ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు వేయించి ఆదర్శంగా నిలుస్తున్నారు. 'రిటైర్‌మెంట్ ఉద్యోగానికే గానీ.. సమాజ సేవకు కాదు' అంటున్నారు.

ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత ఎలాంటి పని ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన జీవితం గడిపేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కాలక్షేపం చేసేందుకు చాలామంది ఇష్టపడతారు. కానీ మహదేవపూర్ మండలంలో విరమణ పొందిన ఉద్యోగులు సంఘంగా ఏర్పడి పర్యావరణ హితం కోసం కృషిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం వివిధ రకాల 30 మొక్కలను నాటి వాటిని కంటికిరెప్పలా కాపాడుతున్నారు. సకాలంలో నీరందిస్తూ, పశువుల బారిన పడకుండా ప్రతి మొక్కకు ట్రీగార్డులను అమర్చడంతో ఇప్పుడవి ఏపుగా పెరిగాయి.

మొక్కలకు నీళ్లు అందేలా డ్రిప్ సిస్టం సైతం ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా మహదేవపూర్ బస్టాండ్ ఆవరణలో 12 బెంచీలు ఏర్పాటు చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన మహిళా ఉద్యోగాలను సన్మానిస్తున్నారు. ఇలా విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న కృషి ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తూ సమాజంలో పౌరుల బాధ్యతను గుర్తుచేస్తున్నదనడంలో అతిశయోక్తి లేదు. మెరుగైన సమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిస్తున్నారు. ఇలా వారు చేస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు.



తను నాటిన మొక్క వద్ద విశ్రాంత ఉద్యోగి (ఫైల్)


## నమస్తే తెలంగాణ
## విలేకరులు కావలెను

**అర్హతలు :**

- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణులై.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.

**హనుమకొండ జిల్లాలో కావాల్సిన కేంద్రాలు :** 1. నడికూడ

**వరంగల్ జిల్లా :** 1. దుగ్గొండి 2. మట్టెవాడ 3. వరంగల్ చౌరస్తా

**మహబూబాబాద్ జిల్లా :** 1. సీరోలు 2. మహబూబాబాద్ టౌన్

**జనగామ జిల్లా :** 1. జనగామ టౌన్ 2. స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్

**భూపాలపల్లి జిల్లా :** 1. మహాముత్తారం 2. మొగుళ్లపల్లి

రాతపరీక్ష తేదీ : 13-06-2024 (గురువారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
పరీక్షా స్థలం : నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, ఐటీ పార్క్ లేన్, మడికొండ, హనుమకొండ.
ఫోన్ నంబర్ : 9182777976